సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 48.777 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 48.777 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 14,490 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,090
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,708
3 శాతం జీఎస్టీతో	రూ.6,909
సవర (8గ్రా)	రూ.55,272

గరిష్టం/కనిష్టం
38.1 /28.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 43 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

17 నుంచి స్వచ్ఛత హీ సేవ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువలు.. తాగునీటి చెరువులు, పథకాలను శుభ్రపర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్ ఆనంద్, జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ వేయకపోతే జీతాలు నిలిపేస్తాం



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ప్రతి ఒక్కరూ ముఖ ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్)ను తప్పక వేయాలని, అలా కాకపోతే జీతాలను నిలిపేస్తామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నూరు శాతం సాధించే దిశగా వివిధ విభాగాల అధికారులు కృషి చేయాలని కోరారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డెమో అధికారి కనకరత్నం, డీపీహెచ్‌ఎన్‌ఓ మంజుల, డీపీఓ రమేష్‌బాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ అధికారి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(సెంట్రల్): పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారిగా డాక్టర్ రమేష్ రైల్వేఫీడర్స్ రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలను గురువారం స్వీకరించారు. గతంలో జిల్లా అధికారిగా ఉన్న మహేశ్వరుడు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జిగా కోటేశ్వరరావు వ్యవహరించారు. ఈ తరుణంలో కావలిలో డీడీగా పనిచేస్తున్న రమేష్‌ను రెగ్యులర్ అధికారిగా నియమించారు.

జాతీయ లోక్‌అదాలత్ రేపు

నెల్లూరు (లీగల్): జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, ఉదయగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట కోర్టుల్లో కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అధ్యక్షతన నిర్వహించనున్నామని చెప్పారు. సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ వాహన ప్రమాదాలు తదితర రాజీకి అనువైన కేసులను పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఎస్సెస్‌లలో పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు, విరువూరులో ప్లాంటేషన్లను కావలి డీఎఫ్‌ఓ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. ఇక్కడి పనుల్లో జరుగుతున్న అవినీతి తంతుపై 'వీఎస్సెస్‌ల పేరుతో దోపిడీ' శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. దీంతో ఈ ప్లాంటేషన్లను పరిశీలించారు. కాగా జిల్లా స్థాయి అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలు నేపథ్యంలో తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టారని తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్లలో నయా దందా..

వెలుగులోకి కొత్త అవినీతి బాగోతం

- నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్
- అక్షరాల రూ.కోటి కమీషన్
- కోర్టు ఆదేశాలూ బేఖాతర్
- తప్పు కప్పిపుచ్చుకునేందుకు ఈసీ బ్లాక్
- మంత్రి నారాయణ ఇలాకాలో పేట్రేగిపోతున్న అవినీతి అనకొండలు

అవినీతికి కాదేదీ అనర్హమనే రీతిలో రిజిస్ట్రేషన్ల శాఖ సాగుతోంది. పైసలిస్తే చాలు నిషేధిత జాబితాలో ఉన్న భూములను సైతం రిజిస్టర్ చేస్తున్నారు. భూ యజమానులకు సైతం తెలియకుండా నకిలీ డాక్యుమెంట్లతో ఇతరులకు హక్కు కల్పిస్తున్నారు. గతంలోనూ ఇలాంటివి ఎన్నో వెలుగు చూసి సస్పెన్షన్లకు గురైనా, సబ్ రిజిస్ట్రార్ల తీరులో మార్పురాకపోగా, మరింత బరితెగించి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు సైతం వీరికి అండగా ఉంటూ కార్యాలయాలను అవినీతికి కేరాఫ్‌గా మార్చేస్తున్నారు.


సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిత్రాలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా నిషేధిత జాబితాలో ఉన్న విలువైన భూమిని రిజిస్టర్ చేశారు. ఈ వ్యవహారం వెనుక కోటి రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రి నారాయణ ఇలాకాలో జరిగిన ఈ బాగోతం వెనుక పెద్దల హస్తం ఉందనే ప్రచారం సాగుతోంది.

ఏం జరిగిందంటే..

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని మైపాడు గేట్ సమీపంలో గల సర్వే నంబర్ 312/4ను ఎవరికీ రిజిస్టర్ చేయొద్దని కోర్టు గతంలో ఆదేశించింది. దీంతో సదరు సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో ఉంచారు. రూ.60 కోట్ల విలువైన 5324 చదరపు అడుగుల భూమిని కాజేసేందుకు గత ప్రభుత్వ హయాంలోనూ కొందరు అక్రమార్కులు విఫలయత్నం చేశారు. తాజాగా ప్రభుత్వం మారడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో కుమ్మక్కయ్యారు. రాజకీయ ప్రముఖుల హస్తం తోడవ్వడంతో నిబంధనలను కాలరాసి నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్‌ను ఎనీవేర్ ద్వారా ఆర్వో కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 29604/2024తో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కింద బుధవారం రిజిస్టర్ చేశారు.

అన్నీ అనుమానాలే..

వాస్తవానికి సదరు భూమి రిజిస్ట్రేషన్‌ను స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయాల్సి ఉంది. అయితే ఆర్వోలో రిజిస్టర్ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవ్వగానే, స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్



అప్రూవల్ ఇచ్చేశారు. అయితే అగ్రికల్చర్ ల్యాండ్ నుంచి కన్వర్షన్ లేకుండానే చదరపు అడుగుల కింద రిజిస్టర్ చేశారని తెలుస్తోంది. వాస్తవానికి పది సెంట్లు దాటి రిజిస్టర్ చేస్తే వన్ బీ, అడంగల్‌ను విధిగా జతపర్చాలి. అయితే ఇవేవీ లేకుండానే తంతును ముగించారని సమాచారం. మరోవైపు రెవెన్యూ రికార్డులను జతపర్చలేదనే కారణంతో ఓ మహిళా సబ్ రిజిస్ట్రార్‌ను గతంలో సస్పెండ్ చేసిన విషయం విదితమే.

తప్పు కప్పిపుచ్చుకునేందుకు తంటాలు..

అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టురట్టవ్వడంతో అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. నిజానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియగానే ఎన్ కంబరన్స్ (ఈసీ)లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి పేరు, డాక్యుమెంట్ నంబర్ చేరుతుంది. ఈ డాక్యుమెంట్లను స్కాన్ చేయాల్సి ఉంది. అయితే వ్యవహారం బయటకు పొక్కడంతో రంగంలోకి దిగిన అధికారులు డాక్యుమెంట్‌ను స్కాన్ చేయనివ్వలేదు. ఈసీని ఆన్‌లైన్లో బ్లాక్ చేయించారు.

అవినీతికి రాజకీయ అండ

మంత్రి నారాయణ ఇలాకాలో అధికారులు బరితెగించేస్తున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక రాజకీయ ప్రముఖుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతికి పాల్పడే అధికారులకు రాజకీయ అండ తోడవ్వడంతో బరితెగిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

విచారణకు ఆదేశించాం

నెల్లూరులో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణకు ఆదేశించాం. అధికారుల తప్పుందని తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతాం. నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్‌ను ఎట్టి పరిస్థితుల్లో రిజిస్టర్ చేయకూడదు. అలా చేస్తే చర్యలు తప్పవు.

– కిరణ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ, నెల్లూరు

భారీ మొత్తంలో చేతులు మారాయి

ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక కోటి రుపాయలు చేతులు మారాయనే టాక్ నడుస్తోంది. నెల్లూరులో పనిచేస్తున్న ఓ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఇందులో వాటాదారుడిగా ఉన్నారని తెలుస్తోంది. తన చేతికి మట్టి అంటకుండా ఎనీవేర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి సహకారం తోడవ్వడంతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి స్టోన్‌హౌస్‌పేట రిజిస్ట్రేషన్.. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఆర్వో కార్యాలయాలు నగరంలోనే ఉన్నాయి. అయినా ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందో ఆ శాఖ అధికారులకే తెలియాలి. రూ.60 కోట్ల విలువైన ఆస్తి కావడంతో ఈ తతంగంలో అందరూ భాగస్వాములై అవినీతికి పాల్పడ్డారు.



మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయం

చిత్రాల్లో మాస్టారు..!

- సెలవొస్తే కెమెరాతో టూర్
- సందేశాన్నిచ్చేలా నాలుగు విభాగాల్లో 300 ఫొటోలు
- 70 పిక్స్‌కు అవార్డులు
- అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో 35 పతకాలు

పిల్లలకు పాఠాలు చెప్తూ.. వారిని ఉన్నత శిఖరాలను చేర్చేందుకు ఉపాధ్యాయులు ఎంతో తపిస్తుంటారు. పాఠశాలల్లో వివిధ పనుల్లో నిత్యం తలమునకలయ్యే వీరు సెలవు రోజుల్లో ఇంట్లో ఉంటూ కొంత సేద తీరుతుంటారు. అయితే లింగసముద్రం మండలం మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనికి భిన్నంగా సెలవొచ్చిందంటే పలు ప్రాంతాలను తన కెమెరాతో చుట్టేస్తూ మధురమైన చిత్రాలను బంధిస్తున్నారు. వృత్తితో పాటు ప్రవృత్తీ జీవితంలో ఓ భాగమని నిరూపించారు.

కందుకూరు రూరల్: లింగసముద్రం మండలం మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాటుకూరి సూర్యప్రకాష్‌రావు తన ఫొటోగ్రఫీ స్కిల్స్‌తో ఔరా అనిపిస్తున్నారు. తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులను ఈయన అందుకున్నారు. చీరాలలోని శాంతినగర్‌కు చెందిన ఈయన తండ్రి నాగేశ్వరరావు సైతం ఉద్యోగం చేస్తూనే హాబీగా ఫొటోలు తీసేవారు. ఇంట్లోనే కెమెరా ఉండటంతో సూర్యప్రకాష్‌రావుకు సైతం ఇదే ఆసక్తి కలిగింది. తండ్రికి తెలియకుండా అప్పుడప్పుడూ కెమెరా తీసుకెళ్లి ఫొటోలను తీసేవారు.

పరిచయస్తుల ద్వారా మెలకువలు

ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి బయలాజిక్ సైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై ఉపాధ్యాయుడిగా 1997లో లింగసముద్రం మండలం మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేరారు. అనంతరం 2009లో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొంది ఇక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. వృత్తిలో రాణిస్తూనే.. పండగలు, వేసవి సెలవుల్లో టూర్లకు వెళ్లినప్పుడు ఫొటోలు తీసేవారు. అక్కడ పరిచయమైన వారి ద్వారా మెలకువలు నేర్చుకొని ఫొటోగ్రఫీలో పట్టు సాధించారు.

అవార్డుల పంట

23 ఏళ్ల వయస్సులో కెమెరా పట్టి సుమారు 300 ఫొటోలను తన కెమెరాలో బంధించారు. బ్లాక్ అండ్ వైట్ (మోనో క్రోమ్), కలర్, నేచర్, ట్రావెల్ విభాగాల్లో ఫొటోలు తీశారు. అయితే వీటిని అవార్డులకు పంపాలనే ఆలోచన రాలేదు. చివరికి స్నేహితులు, సహచరుల సూచనల మేరకు గతేడాది నుంచి అవార్డులకు పంపారు.



జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకున్న ఫొటో

ఈయన తీసిన సుమారు 300 ఫొటోల్లో 70 చిత్రాలకు అవార్డులు లభించాయి. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో 35 అవార్డులు దక్కాయి. ఇందులో పది స్వర్ణ పతకాలు కావడం విశేషం. ఆర్టిస్ట్ ఆఫ్ ది ఫెడరేషన్ ఇన్ ఫొటోగ్రఫీ (ఏఎఫ్ఐపీ)లో దేశవ్యాప్తంగా 69 మంది ఎంపికకాగా, రాష్ట్రం నుంచి ముగ్గురు అర్హత సాధించారు. వీరిలో సూర్యప్రకాష్‌రావు ఎంపికై బ్యాడ్జ్‌ను సైతం దక్కించుకున్నారు.

పొందిన అవార్డులు..

- కొమ్ము డ్యాన్స్ ఫొటోకు యూత్ ఫొటోగ్రఫీ సొసైటీ, బెంగళూరు వారి నుంచి స్వర్ణ పతకం. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఎనిమిది అవార్డులు లభించాయి.
- ఒడిశా బొండా తెగల జీవనశైలిపై తీసిన ఫొటోకు జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం.
- నాగార్జున యూనివర్సిటీ నుంచి బెస్ట్ ఫొటోగ్రఫీ అవార్డు.
- గోదావరి తీరంలో నీటి కొరతపై ఫొటో జర్నలిజంలో తీసిన చిత్రానికి మద్రాస్ ఫొటోగ్రఫీ సొసైటీ నుంచి జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం.
- కేరళలోని కలారిపయట్టు సంప్రదాయ కళల చిత్రానికి జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం.

రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీలో స్థానమే లక్ష్యం




మంచి ఆర్ట్ ఫొటోగ్రఫీలో రాణించాలి. అదే విధంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందుతున్నా. రాయల్ ఫొటోగ్రఫీ ఆఫ్ సొసైటీలో స్థానం సాధించాలనేదే నా ఆశయం. దీన్ని ఎప్పటికైనా దక్కించుకునేందుకు పట్టుదలతో ఫొటోగ్రఫీలో రాణిస్తున్నా.

– కాటుకూరి సూర్యప్రకాష్‌రావు



కేరళలోని కలారిపయట్టు సంప్రదాయ కళల చిత్రం



ఒడిశాలోని బొండా తెగల జీవనశైలి

ఆశలు మెడికిల్

వైద్య విద్యనభ్యసించి.. మంచి డాక్టరై.. ప్రజలకు సేవ చేయడంతో పాటు సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలనేది ఎంతో మంది విద్యార్థుల స్వప్నం. అయితే దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్‌ను దక్కించుకొని ఇందులో సీటు సాధించడమనేది కష్టంతో కూడుకున్న ప్రక్రియ. ఈ తరుణంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను స్థాపించి విద్యార్థులకు సీటుతో పాటు పేదలకు వైద్యసేవలను అందించాలని గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంకల్పించి.. తదనుగుణంగా పనులను వేగవంతం చేసింది. అయితే ప్రభుత్వం మారడం దీనికి శాపంలా పరిణమించింది.

- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కుట్ర
- పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు
- కూటమి ప్రభుత్వ తీరు దారుణం



నెల్లూరు(అర్బన్): వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి నీట్ పరీక్షను రాస్తారు. జిల్లాలో సుమారు నాలుగు వేల మంది పరీక్షలు రాసి.. తమకు మెడికల్ సీటు వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ప్రతిభ చూపిన ఎక్కువ మందికి మెడికల్ సీట్లను అందించాలనే లక్ష్యంతో 17 నూతన మెడికల్ కళాశాలలను గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. నిర్మాణాలూ శరవేగంగా జరిగాయి. 2024 – 25లో ఐదు కళాశాలలను ప్రారంభించాలనే లక్ష్యంతో ఫ్యాకల్టీ, సిబ్బందిని నియమించారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో తమకెక్కడో ఓ చోట సీటొస్తుందని విద్యార్థులు కలలుగన్నారు.

వంచనకు సర్వం సిద్ధం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు వినూత్న పోకడలకు అవలంబిస్తున్నారు. నీట్ రాసి ప్రతిభ చూపుతున్న పేద బిడ్డలకు వైద్య విద్యను అందని ద్రాక్షలా మార్చేశారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నారు. పులివెందుల కళాశాలకు మంజూరైన మెడికల్ సీట్లను రద్దు చేసేలా ఏకంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడమే దీనికి ఉదాహరణ. దీనిపై పలువురు మండిపడుతున్నారు.

ఎక్కడికక్కడే ఆగిపోయాయి..

మిగిలిన మెడికల్ కళాశాలల్లో సైతం కనీస వసతులు కల్పించలేదు. నిర్మాణాలను ఎక్కడికక్కడే ఆపేశారు. పూర్తయిన కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. పూర్తి సీట్లను డబ్బున్నవారే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వ తీరుతో నీట్ రాసిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజులో ఇంత వ్యత్యాసమా..!

ప్రభుత్వ కళాశాలల్లో ఫీజు రూ.10 వేలు మాత్రమే. అదే ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ఒక్కో సీటును వేలం ద్వారా రూ 1.5 కోట్లకు యాజమాన్యాలు విక్రయిస్తాయి. ఇలా సీట్లు కొనే పరిస్థితి పేద బిడ్డలకు కుదరదు. అందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను మరింతగా ఏర్పాటు చేయాలని మేధావులు, ప్రజలు కోరుతున్నారు.

సీఎం తన నిర్ణయాన్ని సమీక్షించాలి



నా కుమారుడు ఇటీవల నీట్ పరీక్ష రాసి ర్యాంక్‌ను సాధించారు. సీటొస్తుందని భావిస్తున్నా. అయితే నూతన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద బిడ్డలకు కష్టాలు.. కన్నీళ్లే మిగులుతాయి. ప్రైవేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా దోచుకుంటాయి. వైద్య విద్య ధనికులకే అందుతుంది. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకొని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలను నడపాలి.

– పోతంశెట్టి విద్యాచరణ్, నీట్ విద్యార్థి తండ్రి

బదిలీల్లోనూ అదే తీరు..

- ఎమ్మెల్యే లెటర్ ఉందా.. అయితే ఓకే
- ముగిసిన గ్రేడ్ – 5, 6 పంచాయతీ కార్యదర్శుల స్థానచలన ప్రక్రియ
- అధికార పార్టీ మార్కుతో సాగిన వైనం

నెల్లూరు (దర్గామిట్ట): పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ అధికార పార్టీ మార్కుతో కొనసాగింది. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రేడ్ – 5, 6 పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. వాస్తవానికి ఒకే పంచాయతీలో ఐదేళ్లుగా పనిచేసిన వారు.. రిక్వెస్ట్‌పై దరఖాస్తు చేసుకున్న వారు.. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌పై బదిలీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచే ఎమ్మెల్యేలు, రాజకీయ నేతల సిఫార్సు కోసం పంచాయతీ కార్యదర్శులు క్యూ కట్టారు.

కలిసొచ్చిన నిబంధన

పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ప్రభుత్వం జారీ చేసిన అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ నిబంధన అధికార పార్టీకి కలిసొచ్చింది. పలానా వ్యక్తి బాగా పనిచేస్తారు.. అవినీతి ఆరోపణలు, పనితీరు సక్రమంగా లేకపోతే బదిలీ చేయొచ్చనే ఈ నిబంధనను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఇదే తడవుగా జిల్లాలో తమ వారిని నచ్చిన చోట నియమించుకునేలా సిఫార్సు లేఖలు అందజేశారు. దీంతో ఐదేళ్లు పూర్తికాకపోయినా, అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వారిని కార్యదర్శులుగా నియమించుకునేందుకు అక్కడున్న వారిని బదిలీ చేశారు. తమ నియోజకవర్గాల్లో తాము సిఫార్సు చేసిన వారినే నియమించాలని ఏకంగా జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారని తెలుస్తోంది. కాగా తొలి రోజు గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శుల్లో 165 మందికి బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. 176 మందికి గురువారం నిర్వహించగా, వీరిలో తొమ్మిది మంది గైర్హాజరయ్యారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే..

ప్రభుత్వ నిబంధనల మేరకే పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను నిర్వహించాం. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న గ్రేడ్ – 5, 6 పంచాయతీ కార్యదర్శుల బదిలీలను జరిపాం.

సుస్మితారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

వేడుకగా గంధ మహోత్సవం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో దొరసానమ్మ గంధ మహోత్సవాన్ని వేడుకగా గురువారం రాత్రి నిర్వహించారు. పీఠాధిపతిగా ఫయాజ్ అహ్మద్ వ్యవహరించారు. డప్పు వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలతో మహల్ నుంచి గంధాన్ని నెత్తిపై పెట్టుకొని ప్రధాన దర్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ అమ్మాజాన్, అబ్బాజాన్ సమాధులకు గంధ లేపనం చేసి భక్తులకు పంచిపెట్టారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి మూడు గంటల సమయంలో మహోత్సవం ముగియడంతో గంధ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. సమాధులను పూలచద్దర్లు, గలేపులతో సుందరంగా అలంకరించారు. డీఎస్పీ వేణుగోపాల్ సారథ్యంలో సీఐలు వేమారెడ్డి, గంగాధర్‌రావు, ఎస్సైలు బందోబస్తు చర్యలు చేపట్టారు.



సమాధులకు గంధ లేపనం

క్లుప్తంగా

సినీ తారల సందడి



నివేదా థామస్‌ను సన్మానిస్తున్న చైర్మన్, డైరెక్టర్‌లు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం లో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సినీ తారలు సందడి చేశారు. '35 చిన్న కథ కాదు' సినిమా ప్రమోషన్ కార్యక్రమం గురువారం కళాశాలలో జరిగింది. చిత్ర తారా గణం హీరోయిన్ నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్‌లు ట్రైలర్ ప్రదర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, సందేశాత్మక చిత్రమని తెలిపారు. ప్రతి విద్యార్థి నిత్య జీవితంలో ఎదుర్కొనే సంఘటనల ఆధారంగా సినిమా రూపొందించినట్లు వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, డైరెక్టర్ లక్ష్మిలు చిత్ర బృందాన్ని శాలువాలు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సహ నటులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధుడిని అటకాయించి ఉంగరం దోపిడీ

నెల్లూరు(క్రైమ్): ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని గుర్తుతెలియని దుండగుడు అటకాయించి ఉంగరం దోచుకెళ్లిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు హరనాథపురం రెండో వీధిలో వెంకట శేషకుమార్ నివాసం ఉంటున్నాడు. ఆయన ఈనెల 10వ తేదీ రాత్రి హరనాథపురంలోని ఏటీఎంకు వెళ్లాడు. నగదు డ్రా చేసుకుని నడుచుకుంటూ ఇంటికి బయలుదేరాడు. దారిలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై వృద్ధుడిని అటకాయించి అతని చేతికున్న బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లాడు. బాధితుడు జరిగిన విషయాన్ని ఊరిలో ఉన్న తన కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలియజేశాడు.

ఫైబర్ నెట్ కేబుల్స్ అగ్నికి ఆహుతి



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే కొంత కాలంగా నిల్వ చేసిన ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ వైర్లు, పరికరాలు అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని మహిమలూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఖాళీ స్థలంలో ఏపీ ఫైబర్ నెట్ కేబుల్స్, వాటికి సంబంధించిన కొన్ని పరికరాలు నిల్వ చేశారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఆకతాయిల చేష్టలతో ఇలా జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.1.50 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని భావిస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- కేసుల నమోదు

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి వినాయక చవితి సందర్భంగా దళితవాడలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. బుధవారం రాత్రి దానిని నిమజ్జనం చేసేందుకు తరలిస్తుండగా తనకు పెత్తనం ఇచ్చి ఉంటే డీజే ఏర్పాటు చేయించేవాడనని బాలఓబులు అనే వ్యక్తి అన్నాడు. దీంతో అక్కడున్న కొంతమంది యువకులు అతడిని పక్కకు నెట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేసి తిరిగొచ్చారు. ఇంటికి వెళ్లిన కృష్ణమూర్తి తన భార్య వెంగమ్మతో కలిసి భోజనం చేస్తుండగా బాలఓబులు అక్కడికి వెళ్లాడు. తనను ఎందుకు తోశారంటూ కడియంతో కృష్ణమూర్తి మణికట్టుపై కొట్టాడు. అడ్డొచ్చిన వెంగమ్మపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా కర్ర, కత్తి తీసుకుని కృష్ణమూర్తి తమ్ముడు ఇంటికి వెళ్లి చంపుతామని బెదిరించాడు. ఈ వ్యవహారంపై కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తనను కృష్ణమూర్తి, పెదనరసయ్య, మరో ముగ్గురు కలిసి కరెంట్ స్తంభానికి కట్టేసి రాళ్లతో దాడి చేశారని బాలఓబులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అడ్డొచ్చిన తన భార్య లక్ష్మమ్మను చేతులు, కాళ్లతో కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	129
లేయర్ (లైవ్) :	105
బ్రాయిలర్ చికెన్ :	234
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	258
లేయర్ చికెన్ :	178



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40



మూసేశారు అమాత్యా..!

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట ఇది. దాతలు రూ.లక్షలు ఖర్చు పెట్టి పేద ప్రజల కోసం నెల్లూరు నగరం నడిబొడ్డున ఉన్న సర్వజన ఆస్పత్రిలో దయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. దీనిని సంబంధిత శాఖ మంత్రి ఘనంగా ప్రారంభించి గొప్పలు చెప్పారు. తీరా చూస్తే దానిని మూసేసి చోద్యం చూస్తున్నారు. పెద్దాస్పత్రి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు డయాలసిస్ సేవలు సకాలంలో అందడం లేదనే విమర్శలున్నాయి.

- జీజీహెచ్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించిన దాతలు
- నెల క్రితమే వైద్య శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- వృథాగా యంత్రాలు, బెడ్స్
- మరోవైపు ప్రభుత్వ డయాలసిస్ కేంద్రం మూత
- ఇబ్బందులు పడుతున్న రోగులు



పెద్దాస్పత్రిలో దాతలు ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం



మూసేసిన జీజీహెచ్ డయాలసిస్ కేంద్రం

నెల్లూరు(అర్బన్): గత ప్రభుత్వ హయాంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో అప్పటి మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద కృషితో జీజీహెచ్‌లో అనేక సేవా కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా పేద కిడ్నీ రోగుల కోసం రూ.80 లక్షలతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు లయన్స్ క్లబ్ ముందుకొచ్చింది. కొన్ని పరికరాలు కొనుగోలు చేశారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. దీంతో ఏర్పాటు ప్రక్రియ తాత్కాలికంగా ఆగింది. ఎన్నికలు పూర్తయ్యాక క్లబ్ నిర్వాహకులు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. దీనికి అనుబంధంగా ఒక ఆర్వో ప్లాంటు సైతం పెట్టారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ – బయ్యా సరోజనమ్మ లయన్స్ పినాకినీ డయాలసిస్ సెంటర్‌గా నామకరణం చేశారు. పెద్దాస్పత్రి వారు కేవలం ఒక హాలు మాత్రమే ఇచ్చారు. అలాగే కేంద్రం నిర్వహణకు టెక్నీషియన్స్‌ను నియమించారు. నిర్వహణకు అయ్యే ఖర్చును సైతం క్లబ్ వారు భరించేందుకు ముందుకొచ్చారు. సంవత్సరానికి సుమారు రూ.10 లక్షలవుతుందని అంచనా వేశారు. యంత్రాలకు మరమ్మతులు అవసరమైనా, కొత్త పరికరాలు కొనాల్సి వచ్చినా క్లబ్ నుంచే ఇచ్చేందుకు అంగీకరించారు.

అందని సేవలు

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా గత నెల 9వ తేదీన అట్టహాసంగా డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో మంత్రి మాట్లాడుతూ పేద కిడ్నీ రోగులకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. తక్షణమే సేవలందుతాయని ప్రకటించారు. ఇది జరిగి నెలరోజులు దాటిపోయింది. అయినా డయాలసిస్ సేవలు రోగులకు అందడం లేదు.

ఉన్న కేంద్రం కూడా మూత

పెద్దాస్పత్రిలో అంతకుముందే ఐదు బెడ్స్‌తో ప్రభుత్వ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రం ఉండేది. ఆరుగురు టెక్నీషియన్లు, ఒక డాక్టర్ ఉన్నారు. అయితే ఈ కేంద్రం ఎప్పుడు చూసినా మూసేసి ఉంటుంది. నెలలో పట్టుమని పదిమందికి కూడా అక్కడ డయాలసిస్ చేయడం లేదు. సిబ్బంది ఖాళీగా ఉన్నారు. వారికి కూర్చోబెట్టి జీతాలిస్తున్నారని సాటి ఉద్యోగులు, డాక్టర్లు పేర్కొంటున్నారు.

ఎంతోమంది బాధితులు

జిల్లాలో నెలకు ఐదువేల మందికి పైగా కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. పెద్దాస్పత్రిలోనే నెఫ్రో ప్లస్ అనే ప్రైవేట్‌కు చెందిన సంస్థ ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు సేవలందిస్తోంది. ఇందులో 17 బెడ్స్ ఉన్నాయి. మూడు షిఫ్ట్‌ల్లో డయాలసిస్ చేస్తున్నారు. నెలకు కనీసం ఈ ఒక్క కేంద్రంలోనే 1,100 నుంచి 1,200 మందికి జరుగుతోంది. ఇక నారాయణ, అపోలో, మెడికవర్, కిమ్స్, ఇతర ఆస్పత్రుల్లోనూ డయాలసిస్ చేయించుకునే వారున్నారు. బెడ్స్ ఖాళీ లేక అనేకమందికి సకాలంలో సేవలందడం లేదు. కొత్త కేంద్రాన్ని ప్రారంభిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రారంభించాలని అడిగాం

లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పడిన డయాలసిస్ కేంద్రంలో త్వరగా రోగులకు సేవలందించాలని సూపరింటెండెంట్‌ను కోరాం. ఆయన త్వరలోనే మొదలుపెడతామని తెలిపారు. పేదలకు ఉపయోగపడుతుంటే మాకు సంతోషంగా ఉంటుంది. అప్పుడు మరికొంత సాయం అందించేందుకు ఉత్సాహం ఉంటుంది.

– కిశోర్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్

చర్యలు తీసుకుంటాం



కిడ్నీ రోగులకు దాతలు ఏర్పాటు చేసిన కేంద్రంలో వారంలోపు డయాలసిస్ సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. అక్కడ సాంకేతికంగా పరిశీలించి సేవలు ప్రారంభిస్తాం. రోగులకు నాణ్యమైన వైద్యసేవలందిస్తాం. జీజీహెచ్‌లో ఇప్పటికే ఉన్న 5 బెడ్స్‌ను దాతలు ఏర్పాటు చేసిన కేంద్రంలో కలిపి వైద్యసేవలందిస్తాం.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

చిట్టితల్లికి పెద్ద కష్టం



కుమార్తెతో మస్తాన్ దంపతులు

కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి ◇ ఆదుకోవాలని కోరుతున్న కుటుంబం

టీ దుకాణం పెట్టుకుని జీవిస్తున్న ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. దీంతో తమ వద్దనున్న డబ్బు మొత్తం ఖర్చు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో పఠాన్ మస్తాన్, పఠాన్ బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి పెళ్లయిన పది సంవత్సరాల తర్వాత ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మించారు. వీరిలో 8 ఏళ్ల పాప హబీబా అనారోగ్యానికి గురైంది. వైద్య పరీక్షల్లో కిడ్నీకి సంబంధించిన కేన్సర్ అని తేలడంతో తల్లిదండ్రులు నెల్లూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చిన్నారికి చికిత్సను ప్రారంభించారు. టీ షాపు నిర్వహించే పఠాన్ మస్తాన్ ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఆరోగ్యస్థితి దిగజారడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి, విజయవాడల్లో ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. అయితే అక్కడ వైద్యులు హబీబాకు శస్త్ర చికిత్స చేయాలని, రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతుందని తెలిపారు. దీంతో మస్తాన్ తన ఆస్తుల్ని అమ్మి చిన్నారికి వైద్యం చేయించడం మొదలుపెట్టాడు. అయినా నగదు సరిపోకపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఆ కుటుంబం దాతల సహకారం కోసం ఎదురుచూస్తోంది.

పఠాన్ బేగం ఫోన్‌పే నంబర్ :
88976 36678

వరద బాధితులకు మెప్మా ఆర్థిక సాయం

నెల్లూరు(బారకాసు): మెప్మా మిషన్ డైరెక్టర్ సూచనల మేరకు విజయవాడ వరద బాధితుల కోసం జిల్లా పీడీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించి అందించారు. ఒక్కో సభ్యురాలి నుంచి రూ.10 చొప్పున విరాళాన్ని సేకరించడం జరిగిందని మెప్మా పీడీ రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీల వారీగా చూస్తే ఆత్మకూరులో రూ.72,500, నెల్లూరు అర్బన్‌లో రూ.3,22,450, నెల్లూరు రూరల్‌లో రూ.4,27,650, కావలిలో రూ.1,41,600, కందుకూరులో రూ.1.20 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెంలో రూ.59,500 సేకరించి ఆ మొత్తాన్ని అందించామన్నారు.

రెండోసారి నోటీసులు

ఆత్మకూరు: పట్టణంలోని వివాదాస్పదంగా ఉన్న కొలగాని రామయ్య సత్రం స్థలంలో నిర్మించిన దుకాణాలను 25వ తేదీలోపు ఖాళీ చేయాలని దేవదాయ శాఖ అధికారులు గురువారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు. గత నెలలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సత్రం స్థలాన్ని ఖాళీ చేయించాలని దేవదాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో తొలిసారి నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోమారు నోటీసులు ఇవ్వడంతో దుకాణదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో సత్రానికి సంబంధించిన స్థలంలో షాపులకు వెనుకవైపున ఇళ్లు నిర్మించుకున్న పలువురు పేదలు ఆందోళన చెందుతున్నారు.

యాప్‌ల వినియోగంపై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీసీ ఉషారాణి

నెల్లూరు(టౌన్): సహిత విద్య ఆర్పీలకు యాప్‌ల వినియోగంపై గురువారం స్థానిక ఇన్‌ఫంట్ జీసెస్ సెంటర్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి ఏపీ సమగ్రశిక్ష అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. సహిత విద్య కన్సల్టెంట్ నరసింహులు, సహాయ సమన్వయకర్త మల్లికార్జునరావులు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సమగ్రశిక్ష ద్వారా ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇందులో 33 యాప్‌లు అప్‌లోడ్ చేయడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆర్పీలు మహాలక్ష్మీనాయుడు, సునీల్‌కుమార్‌లు యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందే చెప్పాడు.. చంపాడు

- తండ్రిని హత్య చేసిన తనయుడు
- కుటుంబ కలహాలే కారణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రాపూరు సీఐ విజయకృష్ణ

సైదాపురం: 'నిన్ను ఎప్పుడూ నాన్నగా చూడను. చంపి తీరుతా' అంటూ కుమారుడు పలుమార్లు కన్న తండ్రిని హెచ్చరించాడు. దానిని నిజం చేశాడు. బండరాయితో మోది తండ్రిని అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన సైదాపురం మండలం మొలకలపూండ్ల గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. రాపూరు సీఐ విజయకృష్ణ, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన పాలేపు వెంకటేశ్వర్లు (53), బుజ్జమ్మ దంపతులకు శివాజీ సంతానం. కుమారుడు పుట్టిన తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో బుజ్జమ్మ భర్తకు దూరంగా ఉంటూ కుమారుడు శివాజీని పెంచి పెద్ద చేసి అతడికి వివాహం చేసింది. శివాజీ కూలి పనులు చేసి తల్లి, భార్య, ఇద్దరు బిడ్డలను పోషిస్తున్నాడు. బుజ్జమ్మను వెంకటేశ్వర్లు చూసుకోకుండా వదిలేశాడంటూ కోపం పెంచుకున్నాడు. ఏదో ఒకరోజు తండ్రిని చంపేస్తానని చెబుతుండేవాడు. వెంకటేశ్వర్లు లారీ క్లీనర్. బుధవారం పని ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. గ్రామంలో రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం కార్యక్రమానికి హాజరయ్యాడు. గురువారం తెల్లవారుజామున నిద్రలో ఉండగా శివాజీ వెళ్లి ఒక్కసారిగా తండ్రిపై బండరాయితో మోది చంపేసి వెళ్లిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు శివాజీని మందలించారు. నాకేమీ తెలియదంటూ బుకాయించగా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శివాజీనే హత్యకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని రాపూరు సీఐ విజయకృష్ణకు తెలియజేయడంతో ఆయన గ్రామానికి చేరుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమిరెడ్డి దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడు. అతడి దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూరాయపాళెం ఇసుక రీచ్ వద్దకు సోమిరెడ్డి కొంతమంది తోడుదొంగలు, చిల్లర దొంగలతోపాటు డూప్‌షాట్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని తీసుకెళ్లి అక్కడేదో జరిగిపోతోందన్నట్లు నాటకాలాడారని ధ్వజమెత్తారు. కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ ఈడీని తీసుకెళ్లి అక్కడ ప్రజాభిప్రాయం సేకరిస్తే.. సోమిరెడ్డి చేస్తున్న దోపిడీ వెలుగులోకి వస్తుందని చెప్పారు. పెన్నానదిలో పేరుకు డ్రెడ్జింగ్ చేసినట్లు చెప్పి ఇసుక నిల్వలను ఎత్తేయాలని ప్లాన్ వేశారని మండిపడ్డారు. అధికారులను రీచ్ వద్దకు తీసుకొస్తే తాను వస్తానని.. అక్కడే అక్రమాలకు స్కెచ్ వేశారా లేదా అనేది నిరూపిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇసుక వ్యాపారులు వద్ద తాను ఏమైనా తీసుకున్నానని నిరూపించాలని కాకాణి సవాల్ విసిరారు.

115 జీఓను రద్దు చేయాలంటూ..

- స్టాఫ్ నర్సుల ర్యాలీ



నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం విడుదల చేసిన 115 జీఓను రద్దు చేయాలంటూ నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. గురువారం ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రూత్ గ్రేస్ మాట్లాడుతూ జీఓ నంబర్ 53 ప్రకారం భర్తీ చేయాల్సిన రెగ్యులర్ పోస్టుల్లో తమను కాంట్రాక్టు సిబ్బందిగా ప్రభుత్వం నియమించిందన్నారు. అందువల్ల రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ అర్హతలున్న ఏఎన్‌ఎంలను శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా రెగ్యులర్ చేయడం దారుణమన్నారు. తమ పోస్టుల్లో వారిని నియమించడం అన్యాయమన్నారు. ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. తమకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్పందించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేణు, నాయకులు ఝాన్సీ, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం వేచి ఉండగా..

- బంగారు ఆభరణాల చోరీ
- విలువ రూ.5 లక్షలు

నెల్లూరు(క్రైమ్): ఓ వృద్ధురాలు తన కోడలితో బస్సు కోసం వేచి చూస్తుండగా గుర్తుతెలియని దుండగుడు బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు కాజేసిన ఘటన నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన పి.సెల్వరాజ్, ఎం.లక్ష్మీప్రసన్నలు దంపతులు. లక్ష్మీప్రసన్న ఆమె కోడలు చెన్నైకి వెళ్లేందుకు గురువారం ఉదయం సుమారు పదిగంటల ప్రాంతంలో ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌కు వచ్చారు. బెంచీలపై కూర్చొని బస్సు కోసం వేచిచూడసాగారు. వారికి సమీపంలోనే ఓ గుర్తుతెలియని వ్యక్తి కూర్చొని ఉన్నాడు. అతను వృద్ధురాలి బ్యాగ్‌ను తెరిచి అందులో ఉన్న రూ.5 లక్షలు విలువచేసే 100 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. కాసేపటికి బ్యాగ్ తెరిచి ఉండడాన్ని గమనించిన లక్ష్మీప్రసన్న అందులో చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. పక్కన వ్యక్తి సైతం కనిపించలేదు. దీంతో అతనే చోరీకి పాల్పడ్డారని భావించిన బాధితులు బస్టాండ్ ప్రాంగణమంతా గాలించారు. ఫలితం లేకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై ఎ.అయ్యప్ప కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.